క్లుప్తంగా

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ కవిత సూచించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో పాసై ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్ పూర్తి చేసిన అభ్యర్థులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 16న ఉదయం 11 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

మద్యం షాపుల్లో తనిఖీలు



వైన్‌షాపులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

దర్శి: మద్యం షాపులపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. దర్శి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం షాపులు, అనుమానిత ప్రదేశాల్లో శుక్రవారం కల్తీ మద్యం, నకిలీ మద్యం కోసం తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కల్తీ మద్యం లేదా నకిలీ మద్యం ఎక్కడా గుర్తించలేదని తెలిపారు. ముండ్లమూరు మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడులు చేశామని చెప్పారు. శంకరాపురంలో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద అక్రమంగా ఉన్న 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. షాపుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం అమ్మకాలు జరపాలని హెచ్చరించారు. సమయపాలన పాటించాలని చెప్పారు. మద్యం షాపుల యజమానులు బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో దర్శి ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరావు, యూసఫ్ షరీఫ్, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది సాయిబాబా, పి.నాగరాజు పాల్గొన్నారు.

శనగ విత్తనాల కోసం రిజిస్టర్ చేయించుకోవాలి

గిద్దలూరు రూరల్: మండలంలోని రైతులు రైతుసేవా కేంద్రాలల్లో శనగ విత్తనాల కోసం ఈ నెల 13 వ తేదీ నుంచి రిజిస్టర్ చేయించుకునే అవకాశం కల్పిస్తున్నామని స్థానిక ఏఓ విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 శాతం సబ్సిడీతో బయోమెట్రిక్ విధానంలో శనగ విత్తనాలు రిజిస్టర్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్ తీసుకుని రావాలని సూచించారు. ఒక్కో ఎకరానికి 40 కిలోల చొప్పున 5 ఎకరాల వరకు విత్తనాలు పంపిణీ చేస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీజే సౌండు బాక్సులు వాడరాదు: సీఐ

అర్ధవీడు: మండల పరిదిలో శుభకార్యాలకు, తిరునాళ్లకు, ఏదైనా ఇతర కార్యక్రమాలకు డీజేలకు అనుమతి లేదని సీఐ కే.మల్లిఖార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు పొందిన వారు మైకు లేదా సౌండు బాక్సులు పరిమిత సంఖ్యలో మాత్రమే వాడుతూ, పరిమిత సౌండు మించకుండా ఉండాలని తెలిపారు.

12న జేవీవీ చర్చావేదిక

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో ఈ నెల 12 వ తేదీ ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గిద్దలూరు అభివృద్ధిపై చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు జె.వి.వి నాయకులు పి.స్వరూపారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగొండ పూర్తయ్యేనా, అన్నదాతకు ఆసరా ఏదీ అనే అంశం పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలి

గిద్దలూరు రూరల్: ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలని స్థానిక ఎంపీడీఓ సీతారామారావు అన్నారు. మండలంలోని పాదలకుంటపల్లెలో శుక్రవారం శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఉయ్యాలవాడ, సంజీవరాయుడుపేటలోని సచివాలయాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయంలోని రికార్డులతో పాటుగా సిబ్బంది హాజరును పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని రిటైర్డ్ ఎంఈఓ సీహెచ్ మాధవకృష్ణారావు అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో శుక్రవారం రూ.10 వేలతో మొక్కలు, ట్రీగార్డ్‌లను రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇమ్మడి తిరుపతయ్య అందించిన ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మన్నెం శ్రీదేవి, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇక నుంచి అంతే!

- ఈకేవైసీ నమోదైతేనే ఉపాధి పని చేసినట్టు..
- పనుల్లో అవకతవకలకు చెక్ పెట్టేందుకు సరికొత్త సాంకేతికత
- పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఈకేవైసీ ప్రక్రియ



ఈకేవైసీ నమోదు చేస్తున్న ఉపాధి సిబ్బంది

పెద్దదోర్నాల: ఉపాధి హామీ పథకంలో నిబంధనలు ఎప్పటికప్పుడు మారుస్తున్నా అవకతవకలకు అడ్డుకట్ట పడటం లేదు. అక్రమాల నివారణకు పనుల వివరాలు ప్రత్యేక యాప్‌లో పొందుపరిచేలా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కూలీల జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. అయినా కొందరు సిబ్బంది పనికి రాకున్నా కొందరికి హాజరు వేస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి సిబ్బందిపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఈకేవైసీ ప్రక్రియ ప్రారంభించారు. మండలంలో సుమారు 25 వేల మంది వరకు ఉపాధి కూలీలు ఉన్నారు. దీంతో కూలీలకు సంబంధించి ఇప్పటికి 10 వేల మందికి ఈకేవైసీ నమోదు చేశారు. మరో 15 వేల మందికి ఈకేవేసీ చేయాల్సి ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ ప్రక్రియను గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు ముమ్మరం చేశారు.

ఆన్‌లైన్‌లో హాజరుతో పాటు రెండు సార్లు ఫొటో

ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగి ఉన్న కూలీల ఈకేవైసీని ఫీల్డ్ అసిస్టెంట్‌లు తమ సెల్‌ఫోన్లలో ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తారు. ఈ ప్రకియ పూర్తి చేసుకుంటేనే ఉపాధి హామీ పనుల్లో హాజరు నమోదవుతుంది. గ్రామాల్లో నిర్దేశించిన పని ప్రదేశానికి కూలీ రాగానే ఫీల్డ్ అసిస్టెంట్‌లు సెల్‌ఫోన్‌లో ఈకేవైసీ తీసుకుంటారు. తిరిగి పనులు పూర్తి చేసి ఇంటికి వెళ్తున్న సమయంలో నాలుగు గంటల తర్వాత మరోసారి సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. రెండు సార్లు ఫొటో తీసినా సరిగ్గా నమోదైతేనే కూలీల ఖాతాల్లో వేతనం పడుతుంది. యాప్‌లో ముందుగా నమోదైన ఫొటో కూలీ పనికి వస్తేనే ఆన్‌లైన్‌లో హాజరు నమోదవుతుంది. దీంతో బినామీ హాజరుకు చెక్‌పడుతుంది. ప్రత్యేక యాప్ ద్వారా పని ప్రదేశం నుంచే పనుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తుండటంతో అవకతవకలు తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



దొనకొండ: ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పొదిలి నుంచి అరవల్లిపాడు మీదుగా వద్దిపాడు, సంగాపురం, వీరేపల్లి, కలివెలపల్లి గ్రామాలను కలుపుకుని గజ్జలకొండ, పోతలపాడు, గానుకపెంట, మార్కాపురం లేదా వయా దొనకొండ మీదగా వెంకటాపురం, ఎస్సీపాలెం, సంగాపురం, వీరేపల్లి, కలివెలపల్లి గ్రామాల మీదగా గజ్జలకొండ నుంచి మార్కాపురం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు. గతంలో మార్కాపురం నుంచి వయా గజ్జలకొండ మీదుగా కలివెలపల్లి, సంగాపురం, అరవల్లిపాడు, దొండపాడు, పెదన్నపాలెం మీదుగా దొనకొండకు బస్సు సౌకర్యం ఉండేది. నేడు బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. మండల ప్రజలు దొనకొండ రావాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలో ప్రయాణంతో ప్రమాదాలకు గురవతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థులు జూన్ నుంచి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావాలంటే ఆటోలు ఆశ్రయించక తప్పడం లేదు. 3 నెలలకు ఒకసారి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఆర్టీసీ అధికారులు హాజరవుతున్నారు. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను అడిగినా ఉపయోగం ఉండటం లేదు. ఇప్పటికైనా ప్రజలు, విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిత్యం దొనకొండ వెళ్తాం



మా పంచాయతీలోని ఆయా గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రం దొనకొండకు వివిధ పనులపై వెళ్లాల్సి వస్తోంది. గతంలో బస్సు సౌకర్యం ఉండేది. నేడు బస్సు సౌకర్యం లేక పోవడంతో ఆటోలు ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ పొదిలి డిపో లేదా మార్కాపురం డిపో అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలి.

– నూనె సరోజ, సర్పంచ్, కలివెలపల్లి

మహిళలు ఉపాధి మార్గాలు సృష్టించుకోవాలి



శిక్షణ పొందుతున్న మహిళలు

దర్శి: గ్రామీణ మహిళలు ఉపాధి మార్గాలు సృష్టించుకోవాలని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త టి. మానస సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలకు రెసిన్ ఆర్ట్‌పై వృత్తి విద్యా శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. కేవీకే సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మానస మాట్లాడుతూ శిక్షణతో గ్రామీణ మహిళలు తమ సృజనాత్మకతను ఆచరణలో పెట్టి కొత్త ఉపాధి మార్గాలు ఎంచుకోవాలన్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం, వ్యాపార నైపుణ్యం, ఆర్థిక స్వావలంబనను పెంపొందించుకోవాలని సూచించారు. రెసిన్ ఆర్ట్ అనేది ఎపాక్సీ రెసిన్‌ను ఉపయోగించి కళాఖండాలు, ఇతర వస్తువులను సృష్టించే ఒక కళారూపమని, ఇది మన్నికైన, నిగనిగలాడే ఉపరితలాన్ని సృష్టిస్తుందని, దీన్ని గృహాలంకరణ, ఆభరణాలు, అనేక ఇతర రకాల కళాఖండాల తయారీలో ఉపయోగించవచ్చని తెలిపారు. దీంతో మంచి ఉపాధి అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. రెసిన్ ఆర్ట్ ద్వారా జ్యువెలరీ, కీచైన్‌లు, కోస్టర్లు, నేమ్ ప్లేట్లు, హోం డెకర్ వస్తువులు వంటి ఆకర్షణీయ, మార్కెట్లో అమ్మకానికి అనువైన ఉత్పత్తులు ఇంటి వద్దే తయారు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామీణ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

నేడు ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో సమస్యలపై చర్చిస్తారని, అనంతరం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, ఈ సందర్భంగా రచ్చబండ, సంతకాల సేకరణ కార్యక్రమాలకు సంబంధించి వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తారని ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొనాలని ముసలారెడ్డి కోరారు.

ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు



సన్మానం అందుకుంటున్న బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులకు శుక్రవారం ఘన వీడ్కోలు పలికారు. వీడ్కోలు సభ ప్రధానోపాధ్యాయుడు వి.ఫణి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు వస్త్రంనాయక్, సీహెచ్ సుబ్బారావు, వైఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు టీవీ సుబ్బారావు, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె. హిమజాకుమారిలు హాజరయ్యారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వి.రామచంద్రరావు, కె.విజయమేరి, కె.ఆదినారాయణ, షేక్ ఖాదర్‌వలిలను ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ అధ్యక్షుడు అన్నెం శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజారహంతుల్లా, జిల్లా కార్యదర్శి సీహెచ్ శివరామకృష్ణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పి.పూర్ణచంద్రరావు, పీఎస్‌హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్మన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబు దోపిడీ కోసమే ప్రైవేటీకరణ



పోస్టర్‌లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తన బినామీల ద్వారా దోచుకునేందుకే సీఎం చంద్రబాబు ప్రైవేటీకరణ చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందించాలని, పేద విద్యార్థులు కూడా డాక్టర్ కావాలని, వారి పేదరికం చదువుకు అడ్డు కాకూడదని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి ప్రజల్లోకి వెళ్లి ఆయనకు ఎక్కడ మంచి పేరువస్తుందా..అని కుట్రలు చేసి ప్రైవేటు పరం చేస్తున్నారని మండిపడ్డారు. అందుకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబూరావు, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, స్టూడెంట్ విభాగం జోనల్ ఇన్‌చార్జి దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు నలదిమ్ము రమణారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు అన్నవరపు రవి, చెరుకూరి జగన్, అంకాల నాగయ్య, మజువలి, ఇత్తడి సామ్యేల్, కొడవటి జాన్, బాలిరెడ్డి, ఉడుముల వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దీపావళి మందులు నిల్వ ఉంటే కేసు

కురిచేడు: మండల పరిధిలో దీపావళి మందులు నిల్వ ఉంటే కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎం.శివ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దీపావళి టపాసుల లైసెన్స్‌లు లేకుండా ఇళ్లల్లో నిల్వ ఉంచినట్లు అనుమానం ఉంటే తప్పక తనిఖీ చేస్తామని హెచ్చరించారు. బాణసంచా నిల్వ ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. దీపావళి టపాసులు అమ్మాలంటే లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్సై శివ స్పష్టం చేశారు.

బాణసంచా విక్రయానికి నిబంధనలు పాటించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ రామారావు

దర్శి: దీపావళి పండగ సందర్భంగా దుకాణాదారులు బాణసంచా అమ్మాలంటే నిబంధనలు పాటించాలని సీఐ రామారావు సూచించారు. పట్టణంలోని బాణసంచా దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ దీపావళి సందర్భంగా బాణసంచా కొనుగోలు కోసం ప్రజలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న షాపుల వద్ద ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. షాపు నిర్వాహకులు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా షాపు దగ్గర, చుట్టుపక్కల అవసరమైన మేరకు డ్రమ్ముల్లో నీరు, ఇసుక, ఫైర్ మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దుకాణం పరిసర ప్రాంతాల్లో సరిపడా లైటింగు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న తీగలేరు



తోకపల్లి సమీపంలో చెక్‌డ్యామ్‌పై పారుతున్న వర్షం నీరు

పెద్దారవీడు: మండల పరిధిలో గురువారం రాత్రి కురిసిన వర్షంతో పాటు ఎగువన కొండ ప్రాంతాల్లో కురసిన వర్షాలకు తీగలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. తోకపల్లి సమీపంలో నిర్మించిన చెక్‌డ్యామ్ కట్ట నిండి వర్షం నీరు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి. చెక్‌డ్యామ్ నిండటంతో దాదాపు నెల రోజులు నీరు నిల్వ ఉంటాయని స్థానిక రైతులు చెబుతున్నారు. తీగలేరు వాగులో పారుతున్న వర్షం నీరు బద్వీడుచెర్లోపల్లి, ఓబులక్కపల్లి గ్రామాల చెరువులకు చేరుతుంది. దీంతో చెరువుల్లో నీరు ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల బోరు బావులు నీటి మట్టం పెరగడంతో సాగు, తాగునీరుకు ఇబ్బందులు ఉండవని రైతులు చెప్పారు. సాగు చేసిన పంటలకు వర్షం ఎంతో మేలు చేస్తుంది. ఇక నుంచి ఎక్కువ వర్షం కురిస్తే పత్తి, మిరప, బొప్పాయి, పొగాకు తదితర పంటలు దెబ్బతినే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల్లో నీరు నిల్వ ఉండటంతో సాగు చేసిన పంటలకు నీటితో ఎలాంటి ఇబ్బందులు లేవని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మహిళలకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దారవీడు: పరిసరాల పరిశుభ్రంతోనే ఆరోగ్యంగా ఉంటామని హెల్త్ అసిస్టెంట్ భరత్‌భూషణ్ పేర్కొన్నారు. మండలంలోని చట్లమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రేగుమానిపల్లిలో వైద్యసిబ్బంది గురువారం ఫీవర్ సర్వే చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ నవీన్‌కుమార్ జ్వరం, చిరువ్యాధులతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేశారు. రోగులకు మాత్రలు పంపిణీ చేశారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చుట్టుపక్కల వృథా నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని, వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని కోరారు. జ్వరం సోకిన వెంటనే స్థానిక వైద్యశాలకు వచ్చి చికిత్స చేయించుకోవాలని కోరారు. ఏఎన్‌ఎం అరుణ జ్యోతి, ఆశా కార్యకర్తలు వెంకటమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆస్తి నష్టం



పిడుగుపాటుకు గురైన ఇల్లు

తాళ్లూరు: మండలంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మాధవరంలో కోటా శ్రీనివాసరెడ్డి ఇంటిపై శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో పిడుగు పడింది. పిడుగుపాటుకు ఇంట్లో వస్తువులు, ఇతర సామగ్రి కాలిపోయింది. దాదాపు లక్ష రూపాయల నష్టం జరిగింది. ఇంటి గోడలు పెచ్చులూడాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



నెర్రెలిచ్చిన గోడ

ఈ-పంట నమోదు పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ

దొనకొండ: మండలంలోని పడమట వెంకటాపురం, అరవల్లిపాడు గ్రామాల పరిధి రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు చేసిన ఖరీఫ్ పంట సాగుకు సంబంధించిన ఈ- పంట నమోదును మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయిలో సర్వే నంబర్లలో వేసిన పంటలు, నమోదు రికార్డులు పరిశీలించారు. అనంతరం అరవల్లిపాడులో రైతులు సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. రైతులకు సలహాలందజేశారు. ఆయన వెంట సిబ్బంది వెంకట్రావు, నవీన్, లక్ష్మణరావు, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



తాళ్లూరు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న శేషమ్మ

తాళ్లూరు: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ప్రభావం అధికంగా ఉంటుందని, దాని నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్ రావు అన్నారు. మండల కేంద్రం తాళ్లూరులో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తెర పురుగు ఆకులు, కాండం తింటుందని, ఎప్పటికప్పుడు పంటను గమనిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కత్తెర పురుగు నివారణకు 0.4 గ్రా ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.3 మి.లీ స్పైనోసాడ్ 45 ఎంసీ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వీఏఏ సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

దర్శి: భూసార పరీక్షలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌సీ వ్యవసాయాధికారి వీవీ శేషమ్మ అన్నారు. మండలంలోని వెంకటాచలంపల్లిలో భూసార పరీక్షలపై శుక్రవారం అవగాహన కల్పించారు. శేషమ్మ మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల కార్డు గురించి వివరించారు.

వీటి ఆధారంగా వివిధ పంటల్లో ఎరువుల యాజమాన్యం, జీవన ఎరువుల వాడకం గురించి తెలిపారు. మండల వ్యవసయాధికారి కె.రాధ వ్యవసాయ పథకాలు, ఈ-పంట గురించి వివరించారు.

దర్శి మోడల్ స్కూల్లో..

8, 9 తరగతుల విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. దర్శి ఏడీఏ బాలాజీనాయక్ నేల ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి వివరించారు. ఒంగోలు భూసార పరీక్ష కేంద్రఏడీఏ ఎస్.సుచరిత మట్టి నమూనా సేకరణ, పరీక్ష విధానం, మొబైల్ అప్లికేషన్, టెస్టింగ్ పరికరాలు పనిచేసే విధానం గురించి విద్యార్థులకు వివరించారు.